నేడు ఎస్‌పి 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాష్టమిని పురస్కరించుకొని ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వ్యయ ప్రయాసలకు లోనై వినతులు అందజేసేందుకు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు రావద్దని పేర్కొన్నారు.

లక్ ఎవరికో.. కిక్ ఎవరికో..?

- జిల్లాలోని 158 దుకాణాలకు 3,427 దరఖాస్తులు
- శ్రీకాకుళం నగరంలోని ఓ దుకాణానికి అత్యధికంగా 48 అప్లికేషన్లు
- పలాస, ఆమదాలవలసలో నామమాత్రంగా దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు

ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైవేట్ మద్యం విధానం వ్యాపారుల్లో కిక్కు పెంచింది. దుకాణాల కోసం విపరీతమైన పోటీ నెలకొంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మూడు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మరో రోజు గడువు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య నాలుగు వేలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీకాకుళం మున్సిపాల్టీ వంటి ప్రాంతాల్లో ఒక్కో దుకాణానికి 30 మందికి పైగా పోటీ పడుతున్న పరిస్థితి నెలకొంది. లాటరీలో ఒక్క మద్యం దుకాణం దక్కినా చాలనే భావనతో ఉత్సాహంతో దరఖాస్తు చేస్తున్నారు. ఈ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నాయకుల నుంచి దళారుల వరకు ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నారు. షాపులకు ఇప్పటికే దరఖాస్తు చేసిన వారు లాటరీ రోజు కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 158 మద్యం దుకాణాల కోసం అధికారులు ఈనెల ఒకటో తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించారు. జిల్లాలోని 12 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు మొత్తం 3,427 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం ఈనెల 11వ తేదీ వరకు గడువు పెంచడంతో దరఖాస్తుల సంఖ్య సుమారు నాలుగు వేలకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీకాకుళం మున్సిపాల్టీ పరిధిలో చాలా తీవ్రంగా పోటీ నెలకొంది. మున్సిపాల్టీలోని 17వ నంబరు షాపునకు అత్యధికంగా 48 అప్లికేషన్లు వచ్చాయి. షాపు నంబరు 18కు 43 దరఖాస్తులు, 19వ దుకాణానికి 42, షాపు నంబర్లు 15, 16కు చెరో 39 దరఖాస్తులు వచ్చాయి. బూర్జ మండలంలోని 41వ నంబరు దుకాణానికి 38 దరఖాస్తులు చేరాయి. రణస్థలంలోని 46వ షాపునకు 41 దరఖాస్తులు వచ్చాయి.



ఆ ప్రాంతాల్లో నామమాత్రం

ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో నామమాత్రంగానే దరఖాస్తులు వచ్చాయి. కొన్ని మండలాల్లో కనీసం డబుల్ డిజిట్‌కూ చేరలేదు. పలాస మున్సిపాల్టీలోని 128 దుకాణానికి కేవలం ఏడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 125, 129, 130 నంబరు గల దుకాణాలకు చెరో తొమ్మిది దరఖాస్తులు వచ్చాయి. షాపు నంబరు 127కు ఎనిమిది మంది మాత్రమే దరఖాస్తు చేశారు. 124, 126 నంబర్లు గల దుకాణాలకు పదేసి చొప్పున వచ్చాయి. పలాస మండలంలోని రెండు దుకాణాలకూ ఏడేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఆమదాలవలస మండలంలోని రెండు దుకాణాలకు చెరో తొమ్మిది మంది దరఖాస్తు చేశారు.

టెక్కలిలో ఒక్క రోజులో ఎంత తేడా?

టెక్కలి నియోజకవర్గంలోని పలు దుకాణాలకు ఐదారు మంది మాత్రమే దరఖాస్తు చేశారు. అప్లికేషన్ల సంఖ్య ఎక్కడా కనీసం రెండంకెల సంఖ్య దాటలేదు. ఈనెల తొమ్మిదో తేదీ నాటికి టెక్కలిలోని 98, 101 నంబర్ల దుకాణాలకు అత్యల్పంగా ఐదుగురేసి చొప్పున మాత్రమే దరఖాస్తు చేశారు. గురువారం 98వ నంబరు షాపునకు 11, 101 నంబరు దుకాణానికి పది మంది దరఖాస్తు చేశారు. టెక్కలిలోని 99, 100, 104 షాపులకు ఆరుగురు చొప్పున అప్లికేషన్లు రాగా, ప్రస్తుతం 99వ దుకాణానికి 18.. 100, 104 షాపులకు చెరో 11 దరఖాస్తులు వచ్చాయి. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోదరుని బెదిరింపులతో దరఖాస్తులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో అధికశాతం దుకాణాల్లో కనీసం పది అప్లికేషన్లు వస్తున్నాయి. ఇక్కడ నుంచి దుకాణానికి ఐదారు మాత్రమే వస్తున్నాయి. అప్లికేషన్లు వేయనీయకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్న విమర్శలూ లేకపోలేదు. దీంతో సర్దుకున్న అమాత్యుని అనుయాయులు సిండికేట్లతో అదనంగా దరఖాస్తులు పెట్టించినట్లు తెలుస్తోంది.

సమీక్షిస్తున్న జాయంట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

16 నాటికి భూముల స్థితి తెలియజేయాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 16వ తేదీ నాటికి ఆయా శాఖలకు కేటాయించిన భూముల పొజిషన్ తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ల్యాండ్ ఎలినేషన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ఆయా శాఖలకు కేటాయించిన భూములు పొజిషన్ తక్షణమే తెలియజేయాలన్నారు. ఆర్‌డిఒలు ఈ విషయంపై సమీక్షించాలని ఆదేశించారు. ఆయా శాఖలకు కేటాయించిన భూములు ఇంతవరకు అప్పగించకపోతే తక్షణమే అందజేయాలని స్పష్టం చేశారు. కేటాయించిన తర్వాత ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా చూసుకోవలసిన బాధ్యత సంబంధిత శాఖలదేనన్నారు. ఎపిఐఐసికి కేటాయించిన భూమిని ఇంత వరకు తహశీల్దార్ అప్పగించలేదని ఎపిఐఐసి అధికారి చెప్పగా, జెసి రణస్థలం తహశీల్దార్‌ను అడుగ్గా... రికార్డులు పరిశీలించి భూమి అప్పగించేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు భూమి అవసరం ఉందని ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు చెప్పగా, పరిశీలించాలని పలాస ఆర్‌డిఒను జెసి ఆదేశించారు.

జిల్లాలో మొత్తం ఎకరాలు 3161.55 సెంట్లు భూమి ఎలినే షన్స్‌కు పంపినట్లు చెప్పారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో ఎకరాలు 2121.61 సెంట్లు, టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో ఎకరాలు 785.93 సెంట్లు, పలాస రెవెన్యూ డివిజన్‌లో ఎకరాలు 254.01 సెంట్లు ఉందని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవె న్యూ అధికారి ఎం.అప్పారావు, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష, పలాస ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ జాన్ సుధాకర్, సర్వే అండ్ లాండ్ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు విజయ్‌కుమార్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ బి.శాంతశ్రీ, కలెక్టరేట్ ఈ-సెక్షన్ పర్యవేక్షకులు పి.సరోజని పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత శ్రీకాకుళం జట్టు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు విజయం సాదించింది. నాలుగు రోజులుగా నిర్వహించిన పోటీలు గురువారంతో ముగియడంతో నిర్వహకుల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా నలుమూలల నుంచి 112 జట్లు పాల్గొనగా, బుధవారం రాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో అమలపాడు, శ్రీకాకుళం జట్లు నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డాయి. ఉత్కంఠ పోరు మధ్య శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. స్పాన్సర్ లింగూడు సోమేశ్వరరావు రూ.30వేలు నగదు, ట్రోఫీను బహుకరించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన అమలపాడుకు రూ.25 వేలు, షీల్డు, తృతీయ స్థానంలో నిలిచిన కెఆర్ స్టేడియం జట్టుకు రూ.20 వేలు షీల్డు, నాలుగో స్థానంలో నిలిచిన గొల్లమాకన్నపల్లి జట్టుకు రూ.15 వేలు, షీల్డు, ఐదో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం గల్లీ బాయ్స్ జట్టుకు రూ.8 వేలు నగదును స్పాన్సర్ సత్య బ్రదర్స్. నేను నా క్లాస్మేట్స్, యు.ఆర్.పురం జగదాంబ సెంటర్, పవన్ అండ్ సత్యంగ్రూపు సభ్యులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణమూర్తి పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

మానవతా దృక్పథంతో సేవలు

శ్రీకాకుళం అర్బన్ : అంగవైకల్యంతో బాధపడే వారిపై సంకుచిత భావం లేకుండా మానవతా దృక్పథంతో సేవలందించాలని జిల్లా న్యాయసేవాది .కార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనో వికాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడున్న మానసిక వికలాంగులతో ఆయన కొంతసేపు గడిపి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వాహకులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మనో వైకల్యంతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక వికలాంగులపై సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఆయనతో పాటు న్యాయవాది ఇందిరా ప్రసాద్, కేంద్రం నిర్వాహకులు బెహరా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికేనని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని తహశీల్దార్ కార్యాలయంలో రూరల్ మండలాల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను గురువారం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు వస్తున్నాయన్నారు. పింఛను మంజూరు చేయాలని, ఇళ్ల బిల్లులు అందించాలని, తాగునీరు, సాగునీరు, తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా అందించినట్లు తెలిపారు. రీ సర్వే చేసిన దానికి ఎల్‌పి నంబర్లు ఇచ్చి జాయింట్ జాయింట్ అకౌంట్‌లో ఇవ్వడంతో ఈ క్రాస్ కూడా జరగని పరిస్థితి నెలకొందని తెలిపారు. ధాన్యం అమ్మకాలు, కొనుగోలు కూడా అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏడాదిగా కొత్త పింఛన్లు అందించిన సందర్భాలు కూడా లేవన్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరైనా బిల్లులు చెల్లించలేదని, ప్రజల నుంచి వినతలెక్కువగా అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మన పలాస బాధ్యత

ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపుతో కదిలిన జనం

ప్రజాశక్తి- పలాస

మన పలాస - మన బాధ్యత అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని రోడ్లకి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ స్వచ్ఛందంగా చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. దీంతో నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటీలో కూటమి శ్రేణులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, అభిమానులు స్వచ్ఛదంగా గురువారం ఉదయం 6 గంటలకే సన్నద్ధమయ్యారు. 7 గంటలకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఎమ్మెల్యే కలిసి మండలంలోని కేదారిపురంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొక్లెయినర్లు, ట్రాక్టర్లు సిద్ధం చేసుకుని పనులు మొదలుపెట్టారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చిన్నబాడంలో పాత జాతీయ రహదారిలో గల కాగితాల ఖాన నుంచి రైల్వే బ్రిడ్జి వరకు ఇరువైపులా ఏర్పడిన జంగిల్‌ను పలాసకు చెందిన బడ్డ నాగరాజు తన సొంత నిధులతో క్లియర్ చేయించారు. అదేవిధంగా మందసలో భావన దుర్యోధన ఉదయం 6 గంటలకే మందస, హరిపురం రహదారిలో జంగిల్ క్లియరెన్స్ పనులను పర్యవేక్షించి చేపట్టారు. ఆయన బాలిగాం గ్రామ పరిసరాల్లోనూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాలు, మండల హెడ్ క్వార్టర్స్ కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. బొడ్డపాడులో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గం నలుమూలల శిరీష భర్త వెంకన్న చౌదరి చుట్టు ముట్టేశారు. అందరిని ఉత్సాహపరుస్తూ పాల్గొన్న ఆయన అధికారులకు అభినందనలు తెలుపుతూ, తాను స్వయంగా జంగిల్ క్లియర్ చేస్తూ కార్యక్రమానికి హాజరైన వారికి మరింత ప్రోత్సాహాన్ని నింపారు. ఈ ఒరవడిని జిల్లా వ్యాప్తంగా స్ఫూర్తి నింపేవిధంగా మన నియోజకవర్గం ఆదర్శంగా ఉండాలన్నారు.

చెత్తతో విద్యుత్ ఉత్పత్తి : జెసి

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ చెత్తతో విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు స్థల సమీకరణ చేపడుతున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దృష్టిలో ఉంచామని చెప్పారు. ప్రధాని, ముఖ్యమంత్రి స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంకల్పంతో ఉన్నారని అన్నారు. వారి ఆలోచనల మేరకు మన జిల్లాను కూడా స్వచ్ఛ జిల్లాగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే తీసుకున్న ప్రయత్నాన్ని అభినందిస్తూ నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తానని వెల్లడించారు.

గ్రామాన్ని మన ఇంటిలాగే శుభ్రపరచాలి : ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఇంటిని ఏరకంగా అయితే శుభ్రంగా ఉంచుకుంటామో.. అదే రకంగా పరిసరాలను, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకునే విధంగా అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని కార్యక్రమాలు ప్రభుత్వమే నిర్వహించాలంటే భారమవుతుందని, కొన్ని పనులను మనమే సామూహికంగా పరిష్కరించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయ పడ్డారు. ఒక రోజుతోనే ఇవన్నీ సాధ్యం కావని తెలిసినా, అలవాటు చేసుకుంటే అంచెలంచెలుగా గొప్ప ఫలితాలను రాబట్టవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఎస్.రామారావు, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, ఆర్‌అండ్‌బి డిఇ రామినాయుడు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పి.విఠల్, రవిశంకరుప్తా, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చీపురుతో శుభ్రం చేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్, ఎమ్మెల్యే శిరీష

సంక్షేమ పథకాల పునరుద్ధరణకు కృషి

ఎమ్మెల్యేలు మురళీమోహన్, జయకృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలు హామీ ఇచ్చారు. నగరంలోని ఇలిసిపురం అంబేద్కర్ భవనంలో దళిత జెఎసి ఆధ్వర్యాన ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం నాయకులు పోతల దుర్గారావు అధ్యక్షత గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్‌సి, ఎస్‌టి పథకాల్లో కొన్నింటిని ఇప్పటికే టిడిపి కూటమి పునరుద్ధరించిందన్నారు. మిగిలిన వాటిని పూర్తి స్థాయిలో తిరిగి పనరుద్ధరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారన్నారు. ఎస్‌సిల్లో అనేక మంది ఇంకా వెనుకబాటుకు గురై ఉన్నారని, అందువల్ల మేధావులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు నెలలో రెండు రోజులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి నిరుద్యోగ యువతకు చైతన్యం కలిగించాలని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో యువతకు 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తుందన్నారు. వాటిలో ఎస్‌సి, ఎస్‌టిలకు 25 శాతం ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. జయకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు ఐక్యంగా ఉంటూ పోరాటాలు సాగించాలన్నారు. సంఘ ప్రతినిధుల కోరిక మేరకు త్వరలోనే తన సొంత నిధులతో సామాజిక భవనం నిర్మాణం చేపడతా నన్నారు. అనంతరం ఎమ్మెల్యేలను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం కన్వీనర్ ఎన్.భరత్ భూషణ్ రాజు, విశ్రాంత ఆర్‌డిఒ పి.ఎం.జె.బాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి ఫెడరిక్, దళిత మహాసభ అధ్యక్షులు బొకర నారాయణరావు, గంజి ఎజ్రా, కె.రామప్పడు, దళిత జెఎసి అధ్యక్షులు బత్తిన మోహన్, న్యాయవాది మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న దళిత జెఎసి నాయకులు

పట్టుబడిన ఇత్తడి చోరీ దొంగలు

- రూ.9 లక్షల విలువ గల సొత్తు రికవరీ
- ఇత్తడి వాటర్ ట్యాప్‌ల చోరీ కేసును ఛేధించిన పోలీసులు
- ఏడుగురు అరెస్టు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కోటబొమ్మాళి మండలం పాకివలసలో ఇటీవల చోరీకి గురైన ఇత్తడి వాటర్ పైపుల కేసును పోలీసులు ఛేధించారు. దొంగతనానికి సంబంధించి సుమారు రూ.తొమ్మిది లక్షల సొమ్మును రికవరీ చేయడంతో పాటు చోరీకి పాల్పడిన ఏడుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి గురువారం మీడియాకు వెల్లడించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో ఇత్తడి వాటర్ ట్యాప్‌లను బిగించేందుకు కాంట్రాక్టు తీసుకున్న ఎన్ఎఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తనకు వచ్చిన విలువైన మెటీరియల్‌ను కోటబొమ్మాళిలోని పాకివలస సర్వీస్ రోడ్డులో ఒక షాపు అద్దెకు తీసుకుంది. ప్రాజెక్టు ఇన్‌ఛార్జిగా మావులూరు వెంకురెడ్డి గత నెల ఐదో తేదీన షాపు వద్దకు వెళ్లి చూడగా హవక్సావా బ్లేడుతో షట్టర్ తాళం తొలగించినట్లు గుర్తించారు. లోపలకు వెళ్లి చూడగా, తొమ్మిది వేల ఇత్తడి వాటర్ ట్యాపులు ఉన్న 25 మూటలు మాయమైనట్లు తెలుసుకున్నారు. దీనిపై వెంకురెడ్డి గత నెల 30న కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో ట్యాప్ విలువ రూ.వంద ఉంటుందని, మొత్తం తొమ్మిది వేల ట్యాప్‌ల ధర 9 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కేసును ఇలా ఛేధించారు

తెలంగాణ రాష్ట్రం హన్మకొండకు చెందిన కంది సంపత్, బొందాని రమేష్, చింతల మహేష్ పల్లపు యాదగిరి అదే ప్రాజెక్టులో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి మండలాలలో పనిచేస్తూ, చీపుర్లపాడులో అద్దెకు నివాసం ఉంటున్నారు. వారికి కంపెనీ నుంచి వచ్చే సామాన్ల విలువ, వాటిని ఎక్కడ భద్రపరుస్తారన్న దానిపై అవగాహన ఉంది. వారు పనిచేస్తున్న సమయంలో పాడైన, పనికి రాని లోహపు పైప్‌లు, ట్యాప్‌లు తదితర వస్తువులను ఈ కేసులో ఐదో నిందితుడిగా ఉన్న సత్రాపు సింహాచలం స్క్రాప్ షాప్‌లో అమ్ముతుండేవారు. మూడు నెలలుగా కంపెనీ ట్యాప్‌లను అమ్మి అక్రమంగా డబ్బు సంపాదించేందుకు పథకం వేశారు. దొంగతనం చేసిన వస్తువులను రవాణా చేసేందుకు వారితో గతంలో కూలి పనులు చేసిన కేసులో ఐదో నిందితునిగా ఉన్న కోటబొమ్మాళి మండలం వరహాలమ్మపేటకు చెందిన చెన్నంశెట్టి అప్పన్న సహాయం అడగ్గా, అతను అతని గ్రామానికి చెందిన ఆరో నిందితుడు సదునపల్లి రాముకి చెందిన టాటా ఏస్ మెగా లగేజ్ వ్యాన్‌లో రవాణా చేయాలని పథకం వేశారు. ఇత్తడి ట్యాప్‌లను అమ్మగా వచ్చిన సొమ్ములో కొంత ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటిని విశాఖపట్నంలో అమ్మి సొమ్ము చేసుకునేందుకు వెళ్తుండగా టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావుకు సమాచారం రావడంతో కోటబొమ్మాళి మండలం జర్జంగి జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లగేజ్ వాహనంతో పట్టుబడ్డారు.

పోలీసులకు ఎస్‌పి ప్రశంస

ఇత్తడి ట్యాప్‌ల కేసులో క్రియాశీలకంగా వ్యవహరించి కేసును తక్కువ కాలంలోనే ఛేధించడంలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు, టెక్కలి రూరల్ సిఐ శ్రీనివాసరావు, కోటబొమ్మాళి ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది మాధవరావు, లోకనాథం, ఉమామహేశ్వర్లను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

స.హ చట్టం అమలు తప్పనిసరి

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాచార హక్కు చట్టం కచ్చితంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు స్పష్టం చేశారు. స.హ చట్టం అమలు తీరుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార చట్టం అమల్లోకి వచ్చి 19 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని అమలుపరుస్తున్న తీరును సమీక్షించుకోవాలన్నారు. భవిష్యత్‌లో అప్పీళ్ల విచారణ వర్చువల్ విధానంలో జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 4(1)బి సమాచారం ప్రతి కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. దరఖాస్తుదారులు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందజేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం నివేదికలు ప్రతి నెల కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ కార్యాలయాల పౌర సమాచార అధికారులు, అప్పీలేట్ అధికారులు అడిగిన సందేహాలకు జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కె.వసంత్ కుమార్ చట్ట నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ సూర్యనారాయణ, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఆర్‌టిఐ కమిటీ సభ్యులు జె.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌ఒ అప్పారావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రజలు ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని రణస్థలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.17.50 లక్షలతో నిర్మించిన భారత్ నిర్మాణ సేవా కేంద్రం (హెల్త్ విలేజ్ క్లినిక్)ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా సిఎం చంద్రబాబు పని చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి భానోజీ నాయుడు, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, స్థలదాతలు జి.వి.ఎస్.రామారావు పంతులు, శ్రీను పంతులు, గుడిపాటి వెంకట రమణ, నారాయణశెట్టి శ్రీనివాసరావు, దన్నాన మహేష్, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, మెడికల్ స్టాఫ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

విధుల్లో అలసత్వం వహించవద్దు

ప్రజాశక్తి పాతపట్నం

ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించవద్దని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. స్థానిక మార్కెట్ యార్డును గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నైట్ డ్యూటీలో ఉన్న సిబ్బంది అలసత్వం కనిపిస్తుందని అన్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కామరాజు, జయలక్ష్మి

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

స్కిల్ డెవలప్‌మెంట్‌తో యువతకి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఐటి ట్రైనర్ టి.జయలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన ప్రధానోపాధ్యాయులు బి.కామరాజు, జయలక్ష్మి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2024-25 సాధారణ బడ్జెట్‌లో పిఎం ఇంటర్న్ షిప్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అక్టోబరు మూడో గురువారం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. యువతకు ఇంటర్న్‌షిప్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్టుగా తెలియజేశారు. నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

మెళియాపుట్టి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంట్లో నుంచి చెత్త సేకరించి చెత్త నుంచి సంపదను సృష్టించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ డ్రెయినేజీ, కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వీధి దీపాలు, తాగునీటి సదుపాయం, ఇంటి పన్నులు తదితర విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శులు చింతల అప్పారావు, శివాజీ, ఢిల్లీరావు, నాగమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరుణాకరరావు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

పాతపట్నం: మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా నిర్మితమవుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ఇళ్లలైతే రూఫ్ లెవల్లో, రూఫ్ కాంక్రీట్ లెవెల్లో ఉన్నాయో వాటిని డిసెంబరు 31 నాటికి పూర్తి చేయాలన్నారు. వీటికి బిల్లులు చెల్లించాలన్నారు. సచివాలయం వారీగా ఉన్న లక్ష్యాలను సచివాలయ సిబ్బంది అందరికీ బాధ్యత ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, గృహ నిర్మాణ శాఖ సీతారామరాజు పాల్గొన్నారు.

తెలంగాణ డిఎస్‌సిలో మెరిసిన హిమశ్రీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

హిమశ్రీ

ఇటీవల విడుదల చేసిన తెలంగాణ డిఎస్‌సి ఫలితాల్లో కొర్లకోటకు చెందిన పేడాడ హిమశ్రీ హైదరాబాద్ జిల్లాలో 9వ ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ (ఎస్‌జిటి) ఉద్యోగానికి ఎంపికైంది. ఈమె తండ్రి పేడాడ ప్రభాకరరావు ఆంగ్ల ఉపాధ్యాయుడిగా సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్నారు. తల్లి గృహిణి. ఈ సందర్భంగా హిమశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, రాజాంలోని విజేత డైరెక్టర్ అప్పలరాజు శ్రీదేవిల ప్రోత్సాహంతో తాను ఈ ర్యాంకును సాధించగలిగానని తెలిపారు.

డ్రోన్‌తో పంట మందుల పిచికారీ

కెవికె ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

డ్రోన్ సహాయంతో పంట మందుల పిచికారి వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం సరుబుజ్జిలి మండలంలోని ఇసుకల పాలెంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆత్మ ఆర్థిక సౌజన్యంతో డ్రోన్‌తో మందుల పిచికారిపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో కూలీల కొరత, వాతావరణ ప్రతికూల పరిస్థితుల వలన యాంత్రీకరణ అవసరమన్నారు. అందులో భాగంగానే కృషి విజ్ఞాన కేంద్రం జిల్లాలో ప్రధాన పంటైన వరిలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తుందని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ శిక్షణా కార్యక్రమాలను రైతులు

డ్రోన్‌తో పంట పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వినియోగించుకుని అందిపుచ్చు కోవాలన్నారు. నిక్రా పథకం కింద గ్రామంలో ముంపును తట్టుకునే రకాలను పెరటి కోళ్ల పెంపకాన్ని, పెరటి తోటల పెంపకం, కొత్త రకాలను కృషి విజ్ఞాన కేంద్రం తరఫున అందిస్తున్నామని తెలిపారు. కెవికె సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష మాట్లాడుతూ డ్రోన్ల పిచికారితో పురుగు మందును 25 శాతం తగ్గించవచ్చునని, ఒక ఎకరం పొలంలో పది లీటర్ల నీటితో పిచికారీ చేసుకోవచ్చునని తద్వారా 90శాతం నీటిని ఆదా చేయవచ్చునని తెలిపారు. 6 నుంచి 10 నిమిషాల్లో ఎకరా పొలాన్ని డ్రోన్‌తో పిచికారి చేయటం వలన సమయాన్ని ఆదా చేయవచ్చునని తెలిపారు. అనంతరం రైతుల పంట పొలాల్లో డ్రోన్ పిచికారీకి మందు ద్రావణం ఏ విధంగా తయారు చేసుకోవాలి, అలాగే డ్రోన్‌తో ఏ విధంగా పిచికారి చేయాలన్న దానిపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి త్రినాథ స్వామి, ఉప వ్యవసాయ సంచాలకులు రాజగోపాల్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, సేద్య విభాగం శాస్త్రవేత్త పి.హేమలత, ఎస్ఆర్ఎఫ్ నిక్రా ఉప వ్యవసాయ సంచాలకులు వెంకట్రావు, మండల ఎఒ బొడ్డేపల్లి పద్మనాభం, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణదాస్‌ను కలిసిన అన్వేష్

కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అన్వేష్

ఇచ్ఛాపురం : వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో మరింత బలపడేందుకు దోహద పడుతుందని జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు ప్రతి అన్వేష్ అన్నారు. ఈ మేరకు కృష్ణదాస్‌ను గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ వైసిపికి పూర్వ వైభవం వస్తుందని అన్నారు.

మద్యం షాపులకు 152 దరఖాస్తులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని ఐదు మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి అత్యధిక దరఖాస్తులు అందినట్లు పలాస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. మల్లిఖార్జునరావు తెలిపారు. 71 మంది ఆశావహులు గురువారం నాటికి దరఖాస్తులు చేశారని అన్నారు. షాపు నంబరు 136కు అత్యధికంగా 18 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఇప్పటి వరకు 152 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల్లోగా దరఖాస్తులు అందించవచ్చునని తెలిపారు.

పాలపోలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి గురువారం దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఆమెను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి సందర్భంగా ఆమె ఆలయాన్ని దర్శించుకుని మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెను సాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు, పాతిన రమణమూర్తి, శిల్లా గురునాధరావు, కూన నాగు, గొండు రవి, పైడి రాజు, ఎన్ని రాజు, చిన్నారావు, బొడ్డేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

13న సాహితీ సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని బిఆర్ నగర్‌లోని పొన్నాడ అప్పలనరసమ్మ, చిన్నవాడు గ్రంథాలయం (పివిఎన్ మాస్టారు మేడపైన) ఈ నెల 13న ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించు విశ్వ సాహితీ సమావేశాన్ని జయప్రదం చేయాలని విశ్వసాహితీ ప్రధాన కార్యదర్శి పాతిన వరహా నరసింహం ఒక ప్రకటనలో కోరారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి రావూరి భరద్వాజ వర్ధంతి సందర్భంగా సాహిత్యం - ఒక పరిశీలనపై వక్తల ప్రసంగం, చర్చ జరుగునని, అనంతరం స్వీయ కవితా పఠనం జరుగునని తెలిపారు. ఈ సాహితీ సమావేశానికి ఆసక్తిగల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, విశ్రాంత ఉద్యోగులు, కవిగాయకులు, సామాజికవేత్తలు, మహిళలు, సాహిత్యాభిలాషులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి కెజిబివిలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ ఎస్ దేవేందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్-1, అసిస్టెంట్ కుక్-1, చౌకేదార్-1 పోస్టులకు అర్హులైన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 47 ఏళ్లు, పిహెచ్‌సిఐ అభ్యర్థులకు 52 ఏళ్ల వరకు వయసు సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15లోగా ఎంఇఒ కార్యాలయానికి దరఖాస్తులు అందించాలన్నారు.

పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

దేవీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ సుడిగాలి పర్యటిస్తూ... పాల్గొన్నారు. అందులో భాగంగా తిప్పనపుట్టుగ, బిర్లంగి, తోటూరు, కీర్తిపురం, కొలిగాం గ్రామాల్లోని అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దక్కత ఢిల్లీరావు, దాసరి రాజు, బోర ప్రసాద్, సారి మహదేవ్ రెడ్డి, దుపాన సూర్యనారాయణ, దక్కత కామేశ్వరరావు, లోపింటి పద్మనాభం, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

పాతపట్నం : మండలంలోని సీది, తామర, తీమర, గంగుపేట గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యను కొద్ది రోజులుగా ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.15 లక్షల విలువైన నాలుగు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది గురువారం ఏర్పాటు చేశారు. దీంతో లోవోల్టేజ్ సమస్య తీరిందని ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలి

వజ్రపుకొత్తూరు : పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మన పలాస-మన బాధ్యత కార్యక్రమాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పాత టెక్కలిలో గురువారం నిర్వహించిన జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు, ప్రజలు, అధికారులు మన పలాస-మన భాధ్యత కార్యక్రమంలో పాలుపంచుకుని విజయవంతం చేశారని తెలిపారు. స్వచ్ఛందంగా ప్రజలు భాగస్వామ్యంతో శ్రమదానం ద్వారా కొన్ని పనులు మనమే చేసుకోవాలన్నారు. మండలంలో సుంకర జగన్నాథపురం, గోవిందపురం, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పిరియా శివప్రసాద్, పిరియా రమణమూర్తి, పుచ్చ ఈశ్వరరావు, బాలక గిరి, సూరాడ మోహనరావు, బి.శశిభూషణ్, ఎంపిడిఒ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

మందస : మన పలాస-మన బాధ్యత కార్యక్రమానికి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని నారాయణపురంలో మన పలాస-మన బాధ్యత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, మాజీ ఎంపిపి దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, మాజీ సర్పంచ్ బొంగు దామోదరం, మల్లేనా జగన్నాథం, ధర్మారావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లాలో పెన్షనర్ల సమస్యలు సత్వర పరిష్కారానికి జిల్లా పెన్షనర్ల సంఘం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు తెలిపారు. గురువారం రణస్థలంలో పెన్షనర్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల రికార్డులు సక్రమంగా ఉండాలని ఆయన అన్నారు. రిటైర్మెంట్ అయిన తర్వాత ఉద్యోగుల పెన్షనర్స్ పరిస్థితి వేరేగా ఉంటుందన్నారు. అలాగే పెన్షనర్ల సంఘం పటిష్టత ప్రతిఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. రిటైర్డ్ సంఘం ప్రధాన కార్యదర్శి ధర్మారావు మాట్లాడుతూ పెన్షన్ విశ్రాంత ఉద్యోగుల ప్రాథమిక హక్కు అన్నారు. ఉద్యోగుల సేవలకు ప్రతిఫలంగా ప్రభుత్వం పెన్షన్ ఇస్తుందని, రిటైర్డ్ ఉద్యోగుల జీవన భృతి పెన్షన్ అని అన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలో మాత్రమే సబ్ ట్రెజరీకి లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, జీవన ప్రమాణంలో సబ్ ట్రెజరీలో పెన్షనర్ల పేర్లు ఉందో లేదో చూసుకోవాలన్నారు. పెన్షనర్ల సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా పెన్షనర్ల సంఘం ప్రత్యేక శ్రద్ధ

మాట్లాడుతున్న రామచంద్రరావు

చూపుతుందని, పెన్షనర్లు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రతినిధి మోహనరావు కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రతినిధులతో పాటు రణస్థలం, లావేరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పున్నాన నరసింహులు నాయుడు, పాపినాయుడుతో పాటు సిహెచ్. గోపాలరావు, బాలి రామానాయుడు, మన్నే కృష్ణానందం, సత్యనారాయణ, లక్ష్మణరావు, ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నూతనంగా ఏర్పడిన శ్రీకాకుళం జిల్లా వాల్టప్ ఎపి ఇంజినీర్ల సంఘం సర్వసభ్య సమావేశం నగరంలోని 80 అడుగుల రోడ్డులో వి1 ఫంక్షన్ హాల్‌లో జరిగింది. గురువారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఇంజినీర్ల సంఘం అధ్యక్షునిగా బూర్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీర్ల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమిష్టి కృషితో ఇంజనీర్ల సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాకి సురేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ఇంజనీర్లకు ఎదురవుతున్న అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకునేందుకు సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సమావేశంలో చైర్మన్‌గా హారికా ప్రసాద్, ముఖ్య సలహాదారుగా కె.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వాండ్రంగి శ్రీనివాసరావు, వెంకుమహంతి శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, కె.హరీష్, బి.శ్రీనివాసరావు, డి.కామేశ్వరరావు, డిఎస్ఎన్ఎల్ మూర్తి, రవి, రాంజీ, శశికాంత్, ఈశ్వర్, రామకృష్ణ, సందీప్ రెడ్డి, కిరణ్ కుమార్, రామానాయుడు, రాహుల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శివతేజ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిఐ నాగరాజు

పుట్టిన రోజు వేడుకలను ఆడంబరంగా జరుపుకుంటున్న ఈరోజుల్లో తనవంతు బాధ్యతగా సామాజిక సేవ చేసేందుకు ముందుకొచ్చిన శివతేజ అభినందనీయుడని ట్రాఫిక్ సిఐ నాగరాజు అన్నారు. గురువారం మానవతా స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో శివతేజ చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. లైన్స్ బ్లడ్ బ్యాంకులో తలసేమియా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ ప్రొఫెసర్ డా.విష్ణుమూర్తి, వైస్‌చైర్మన్ నటుకుల మోహన్, లైన్స్ బ్లడ్ బ్యాంకు అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్, నేషనల్ లా యూనివర్సిటీ ఎల్.ఎల్.బి విద్యార్థిని పొన్నాడ యోజిత, ఎన్‌సిసి క్యాడెట్లు దేవర ప్రసాద్, కందుకూరి జయ సూర్య తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు టెక్కం రామ్ గోపాల్, పొడుగు చరణ్, గుత్తు చిన్నారావు, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, టెక్నీషియన్ కె. దుర్గ, వై.వందన పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- నరసన్నపేట

నిరుద్యోగులైన యువతకు ప్రోత్సాహం అందించడమే ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాల లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు అన్నారు. స్థానిక గ్రంథాలయ సంస్థకు వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు చదువుకునేందుకు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ కార్యదర్శి తెలిపారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులకు చదువుతోపాటు పోటీ పరీక్షలపై అవగాహన అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. కళాశాల అధ్యాపకులు పి.మోహనరావు, వై.రాంబాబు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట : పుస్తకాలను అందజేస్తున్న ప్రసాదరావు

లావేరు: ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదువుకోవాలని విద్యార్థి దశలో సెల్‌ఫోన్ వినియోగించరాదని పోస్టుమాస్టర్ లక్ష్మి అన్నారు. గురువారం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయంలో చదువుకుని డిఎస్‌సిలో ఉపాధ్యాయ పోస్ట్ సంపాదించిన ఎం.భాస్కరరావు రిఫరెన్స్ పుస్తకాలు, కాంపిటీషన్ పుస్తకాలు, ఎపిపిఎస్‌సి గ్రూపు టు మెయిన్ పేపర్స్, గ్రూపు-2 మోడల్ పేపర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, భారతదేశ చరిత్ర సంస్కృతి, భారతదేశ చరిత్ర, కరెంట్ అఫైర్స్ 24, ఎపి టిఇటి, ఆర్ఆర్‌బి, మ్యాథమెటిక్స్‌తో పాటు మరికొన్ని రిఫరెన్స్ పుస్తకాలు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావుకు అందజేశారు. అలాగే సుమారు 100 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

లావేరు : మాట్లాడుతున్న పోస్టుమాస్టర్ లక్ష్మి

నిందితులను ప్రవేశపెట్టిన సిఐ చిన్నంనాయుడు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరి నిందితులను అరెస్టు చేశామని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు స్టేషన్ ఆవరణలో గురువారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. మండలంలోని తోటురు ఎలిసి గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా... సౌమెన్ రఫిక్ షేఖ్ , సాగర్ మహేష్ అనుమానాస్పదంగా తిరుగుతున్నారని అన్నారు. వారి బ్యాగులను పరిశీలించగా అందులో 25.060 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించామని అన్నారు. వీరిద్దరూ మహా రాష్ట్రానికి చెందిన వారని తెలిపారు. ఒడిశా రాష్ట్రం మోహన నుంచి ముంబాయికి తీసుకెళ్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఎప్పటి కప్పుడు పరిశీలించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి క్రయవిక్రయాలు, రవాణా వినియోగం వంటి సమాచారాన్ని సంబంధిత పోలీసులకు తెలపాలని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయించినా, గంజాయి సేవించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. చట్టపరంగా రౌడీషీట్లు తెరుస్తామన్నారు. రెండోసారి పట్టుబడితే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారని తెలిపారు.

బస్ షెల్టరు నిర్మాణం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలం రణస్థలంలో సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి భాను తన సొంత నిధులతో బస్‌షెల్టర్ నిర్మించడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. భాను సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్, బృందావన్ గార్డెన్‌ను ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సర్పంచ్ భానుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఎంపిటిసి రమణ, లెంక శ్యాం, పిసిని జగన్నాధం నాయుడు, ముక్కు ఆదినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

23న నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి కె.దామోదరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 13లోపు తెలియజేయాలని, 14న నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు తెలిపారు. అదే రోజు నామినేషన్ల స్వీకరణ 16న నామినేషన్ల పరిశీలన, 17న ఉప సంహరణ, 18న పోటీలో నిలిచే అభ్యర్థులను ప్రకటిస్తామని వివరించారు. 23న రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

చెక్కును అందజేస్తున్న హరికృష్ణ

సీతయ్య ఫౌండేషన్‌కు వితరణ

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మాకన్నపురానికి చెందిన ఉలాల హరికృష్ణ, జ్యోతి దంపతులు సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమం, పేద విద్యార్థుల మౌలిక వసతలకు గురువారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ చెక్కును మాకన్నపురం పంచాయతీ సర్పంచ్, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు ఎంఎన్ఆర్ సేవా సంఘం సభ్యులు ద్వారా సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్‌కి అందజేశారు. కార్యక్రమంలో ద్వారకా డిఫెన్స్ అకడమీ డైరెక్టర్ మడ్డు శంకరరావు, బతకల గణపతి పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు, తమ బిడ్డల భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 289వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గురువారం దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

సోంపేట: మండలంలోని లక్కవరంలో సరస్వతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని కవిటికి చెందిన చింతామణి టీం సభ్యులు, ద్వితీయ బహుమతిని లండారి పుట్టుగ విజయ దుర్గ టీం సభ్యులు, తతీయ బహుమతిని లక్ష్మీనారాయణ టీం సభ్యులు గెలుపొందారు. వీరికి కీర్తిశేషులు వజ్జ కామయ్య కుటుంబ సభ్యులు, శారద విద్యానికేతన్ నిర్వాహకులు నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సనపల శ్రీరామ్మూర్తి, వైద్య కృష్ణారావు, పి.నారాయణ, హేమ సుందర్ పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

అవార్డు అందుకుంటున్న మధుబాబు

మధుబాబుకు అవార్డు

పాతపట్నం: ఇంపాక్ట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యాన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశంపై ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పాతపట్నానికి చెందిన మహేంద్ర కళాశాల ఎండీ, వ్యాపారవేత్త శాసనపురి మధుబాబుకు బెస్ట్ పార్టిసిపెంట్ అవార్డును నాగేశ్వరరావు గురువారం అందించారు. పట్టణానికి చెందిన తోటి వ్యాపారులు, కళాశాలల యజమానులు అభినందనలు తెలిపారు.

తుప్పల్లో ఉన్న హెచ్చరిక బోర్డులు

పొదల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు

పట్టించుకోని ఆర్అండ్‌బి అధికారులు

లావేరు: మండలంలోని సుభద్రాపురం, బీపురుపల్లి రహదారి రామునిపాలెం గ్రామం దగ్గర నుంచి వెంకటాపురం గ్రామాల మధ్యలో రహదారికి ఇరువైపులా ప్రమాదాలు జరిగే ప్రదేశం, గెడ్డదగ్గర వంతెనలు ముందు నెమ్మదిగా వెళ్లాలి. ముందు మలుపులు ఉన్నాయి. ముందుగా ఆయా ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను వాహనాదారులకు హెచ్చరిక బోర్డులు ద్వారా తెలియ చేసే విధంగా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు కనిపించకుండా చెట్లు, పొదలు అల్లుకోవడంతో భారీ వాహనాలు కొత్తగా ఆ రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కొంత కాలం క్రితం ఓ భారీ లారీ వంతెన రెయిలింగ్‌పై దూసికెళ్లి వాగులోకి బోల్తా పడకుండా ప్రమాదం తప్పింది. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రమాదాలు భారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖాధి కారులు పట్టించుకోని పొదల్లో చిక్కుకున్న ప్రమాద సూచిక బోర్డులకు చుట్టుకున్న పొదలు, తుప్పలను తొలిగించి బోర్డులు వాహనదారులకు కనిపించేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గాడిద పాలు విక్రయం

గాడిద పాలు అమ్ముతున్న మహిళ

రణస్థలం : మనకు పాలిచ్చే జంతు వులంటే ఆవులు, గేదెలే గుర్తొస్తాయి. కాని ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో ఇతర జంతువుల పాలు కూడా తాగుతారు. ఆ ప్రాంతాలేంటో తెలుసుకుందాం! ముందుగా.. మనకు చిన్నప్పుడు ఉబ్బసానికి గాడిదపాలు పెద్దలు తాగించే వారు. గుర్తుందా..! అలాగే స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, పోర్చుగల్లో లాక్టోస్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందని, శరీర దృఢత్వానికి ఉపయోగపడే వే ప్రోటీన్ అధికంగా ఉంటుందని గాడిద పాలను డైట్లో భాగం చేసుకున్నారు. అలాగే మధ్య ఆసియాలో ఎక్కువగా గుర్రం పాలు తాగుతారు. ఇది అక్కడి వారికి సంప్రదాయంగా వస్తున్న ఆచారం. ఆడ గుర్రం పాలలో వే ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని చెబుతారు. తర్వాత కెనడా, రష్యా, స్వీడన్‌లో దుప్పిపాలతో చీజ్ తయారు చేస్తారు. వీటిలో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. నాలుగు శతాబ్దాలుగా ఒంటె పాలను ఈజిప్ట్, ఉత్తర ఆఫ్రికా, ఆసియాలోని పలు ప్రాంతాల్లో ఆహారంలో భాగం చేసుకున్నారు. ఇందులో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. గాడిద పాలు ఆరోగ్యానికి చాలా మంచిదని ప్రచారంలో ఉండడంతో ఈమధ్య రణస్థలం ప్రాంతంలో గాడిద పాలు చాలా మంది తాగుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు గాడిద పాలు కొని పడుతున్నారు.

ఆదమరిస్తే అంతే...

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

అలికాం, బత్తిలి రహదారి మధ్యలో ఉన్న ప్రమాదకర గొయ్యితో పలువురు వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ గొయ్యి వద్ద ఎవరైనా వాహనదారులు ఆదమరిస్తే అంతే ఇక్కట్లు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని కొత్తకోట గ్రామ సమీపంలో నిత్యం భారీ వాహనాల తిరుగుతున్న ఈ రహదారి మధ్యలో భారీ గొయ్యి ఏర్పడి రెండు నెలలు కావస్తున్నప్పటికీ రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించు కోకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యాని స్తున్నారు. కొద్దిరోజుల పాటు సమీప గ్రామ వ్యక్తులు వాహనదారులకు ఎటువంటి ప్రమాదం జరగకూడదని ఏర్పడిన గొయ్యిలో ఎర్ర జెండాను ఏర్పాటు చేశారు.

గొయ్యి వేసిన పిచ్చిమొక్కలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గాలులకు ఎర్రజెండా కనిపించకుండా పోవడంతో గొయ్యిపై ప్రస్తుతం కొన్ని పిచ్చి మొక్కలను వేశారు. కొంతమంది వాహనదారులు వాటిని గమనించినప్పటికీ గొయ్యిలో ద్విచక్ర వాహనాలు దిగి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయరూ...

తుంగపేట వద్ద రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

పొందూరు: రహదారులకు ఇరువైపులా విపరీతంగా పెరిగి ప్రమాదకరంగా మారిన పిచ్చిమొక్కలు ఆర్అండ్‌బి అధికారులకు పట్టదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ఏ రహదారి చూసినా పెరిగిన పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా ఉంది. రహదారులకు ఇరువైపులా ఎత్తుగా పిచ్చిమొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించకపోవడంతో వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో ప్రధా నంగా రాపాక కూడలి నుంచి కింతలి మీదుగా శ్రీకాకుళం రహదారి, లక్ష్మీపేట నుంచి బాణాం రహదారి, రైల్వేస్టేషన్ నుంచి తాడివలస రహదారి, పొందూరు-చిలకపాలెం ప్రధాన రహదారితో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారుల పక్కన పిచ్చిమొక్కలు ప్రమాద కరంగా మారాయి. దీంతో రహదారులపై రాకపోకలు సాగించా లంటే తీవ్ర భయాందోళన చెందుతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారు లు స్పందించి రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు మెయిన్ రోడ్డు కూడలిలో దేవి నవరాత్రులు సందర్భంగా వినాయక యూత్ కమిటీ అధ్వర్యంలో గురువారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లావేరు, లావేటిపాలెం, కేశవరాయపురం, జి.జి.వలస, వస్త్రపురి కాలనీ, అప్పాపురం, వెంకటాపురం, గోవిందపురం, బొడ్డపాడు, గురుగుబిల్లి, తాళ్లవలస, సుబద్రాపురం గ్రామాల నుంచి సుమారు ఐదు వేల మంది యాత్రికులు

రణస్థలం : అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలు

లావేరు : అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలు

పాల్గొన్నారు. అన్నసమారాధనకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఆసౌకర్యం కలగకుండా వినాయక యూత్ కమిటీ అధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

రణస్థలం: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జె.ఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీసభ్యులు మాట్లాడుతూ యువత తమ అభివృద్ధికి తోడ్పడాలని, సామాజిక సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు.

వికసిత భారత్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలో అనేక సమస్యలున్నాయని, వాటిని ప్రభుత్వాలు పరిష్కరించుకుంటూ అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా వికసిత భారత్ దిశగా అడుగులు వేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు ఎస్. జోగినాయుడు, జి.ఇందిరా ప్రసాద్, ఎం.కృష్ణారావు, జి.వి.అప్పల నాయుడు అన్నారు. గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వికసిత భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య రక్ష పథకం ద్వారా 70 ఏళ్ల దాటిన వృద్ధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించే సౌకర్యం కల్పించడం ఆనంద దాయకమన్నారు. వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న

వికసిత భారత్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వాకర్స్

పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాకర్స్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ ప్రతినిధులు గేదెల లక్ష్మీ, వాసంతి, రమ్య, ఎం.మల్లిబాబు, ఎస్.సంజీవరావు, వాసుదేవరావు, నల్లబాటి కృష్ణమూర్తి, ఐ.కె.రావు తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న కింజరాపు సోదరులు

కొత్తమ్మతల్లి సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయాన్ని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోదరులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, విశ్రాంతి అడిషనల్ ఎస్‌పి కింజరాపు ప్రభాకర్, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్ గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆలయ సాంప్రదాయం ప్రకారం వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని యాత్రికులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషగిరి పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న నాయకులు

మొక్కలతోనే మానవాళికి మనుగడ

కోటబొమ్మాళి: మనవాళి మనుగడకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ అన్నారు. స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావుతో కలిసి ఎరకాళి చెరువు గట్టుపైన జిఎస్ఆర్‌జిఎస్ పథకం ద్వారా కొబ్బరి మొక్కలను గురువారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతా మనపైనే ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, కార్యదర్శి చింతాడ సన్యాసిరావు, విఆర్ఒ రంగస్వామి పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న సిఐ రామారావు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి- పాతపట్నం

దసరా ఉత్సవాలలో భాగంగా విజయదశమి రోజున పాతపట్నం అమ్మవారి దర్శనానికి, వాహన పూజలకు వచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బంది కలగకడా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని సిఐ వి.రామారావు, ఎస్ఐ వి.లావణ్య అన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఆలయ ఇఒ వాసుదేవరావుతో కలిసి గురువారం ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. ఆలయానికి ముందు మూడు రోడ్ల కూడలి వద్ద వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఒకవైపు వంతెన నిర్మిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులకు సహకరించాలని సూచించారు.